క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. బీబీబజార్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. పంచ్ మోహల్లా, ఆస్రా ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. పంజేషా, గుల్జార్‌హౌస్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో...

మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఉండదని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. ఫలక్‌నుమా యూజీసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఫలక్‌నుమా ఓహెచ్, రవీంద్రనాయక్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. ముస్తాఫానగర్, జంగమ్మెట్ ఏబీసీ, జంగమ్మెట్ ఓహెచ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



దూద్‌బౌలి: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని శుక్రవారం బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రమేశ్, జాయింట్ కన్వీనర్లు, హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, ధర్మతేజ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వేగవంతంగా చాక్నవాడి నాలా అభివృద్ధి పనులు



గోషామహల్ చాక్నవాడి నాలాను సందర్శించిన ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ చాక్నవాడి నాలా అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడతామని ఎమ్మెల్యే రాజాసింగ్ వెల్లడించారు. శుక్రవారం నాలా అభివృద్ధి పనులను పలు అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నాణ్యమైన స్టీల్ డిజైన్‌తో అధికారులు మరమ్మతులు చేయాలన్నారు. మరో 60, 70 ఏళ్ల వరకు నాలా దృఢంగా ఉండే విధంగా అధికారులు నాలా పనులు పర్యవేక్షించాలన్నారు. తాను తరచూ నాలాను పర్యవేక్షించి నాలా పనులు వేగవంతంగా, జోరుగా చేపట్టే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నాలా పనులు చేయించాలని అధికారులకు సూచించారు.

పార్కింగ్ విషయంలో గొడవ.. కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: పార్కింగ్ విషయంలో తలెత్తిన గొడవ కత్తి పోట్లకు దారితీసిన ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బార్కాస్ సలాలకు సులేమాన్ బామ్(40), అలీ బైసాల మధ్య వివాదం నెలకొంది. కోపోద్రేక్తుడైన అలీ బైసా సులేమాన్ బామ్‌పై కత్తితో దాడి చేశాడు. గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ వర్మ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సుష్మకు జూటూరి విజయలక్ష్మి స్మారక పురస్కారం



సుష్మను సత్కరించిన అమృత్‌కుమార్ జైన్, విద్యావేత్త సూరేపల్లి రవికుమార్

అబిడ్స్: ప్రముఖ కవయిత్రి పి.సుష్మకు జూటూరి విజయలక్ష్మి స్మారక అవార్డు అందజేశారు. విద్యావేత్త సూరేపల్లి రవికుమార్, ప్రముఖ సంఘసేవకుడు అమృత్‌కుమార్ జైన్ ఆమెకు అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ.. తన ప్రతిభను గుర్తించి అవార్డు అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నజనారాజ్ జైన్, బండారి జైన్, పరమేశ్వర్ రెడ్డి, వినీత్‌కుమార్, సుప్రియ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



బేగంబజార్‌లో.. కార్పొరేటర్ శంకర్‌యాదవ్

హోంశాఖ మంత్రి మహమూద్ అలీ

యాకుత్‌పురా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ సూచించారు. యాకుత్‌పురా నియోజకవర్గం రెయిన్‌బజార్ ఎస్సార్టీ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల్లో పరీక్షలు చేయించుకొని కంటి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, డబీర్‌పురా క్లస్టర్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ ఏజిలా అల్భారైడ్, యాకుత్‌పురా యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఫరహా నాజ్ తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో..

అఫ్జల్‌గంజ్: కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బేగంబజార్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు పథకాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దృష్టి లోపాలు ఉన్నవారికి ప్రభుత్వం పూర్తి ఉచితంగా కంటి అద్దాలను అందజేయడం అభినందనీయమన్నారు.

సంతోష్‌నగర్‌లో..

సంతోష్‌నగర్: కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని సంతోష్‌నగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీనివాస్ అన్నారు. కళంధర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించారు. బీసీ సెల్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జగన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అలంబై బషీర్, ప్రేమ్‌కుమార్, రవి, డాక్టర్ అరుణ, మెడికల్ ఆఫీసర్ చంద్రకళ, ఆశా వర్కర్లు జ్యోతి, భారతీ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య రచనలకు బీఓబీ అవార్డులు

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ భాషలలో సాహిత్య రచనలను ప్రోత్సహించేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) అవార్డులను ప్రకటించింది. 'బ్యాంక్ ఆఫ్ బరోడా రాష్ట్రభాష సమ్మాన్' పేరిట ఏర్పాటైన ఈ అవార్డులను ప్రతిఏటా అందించనున్నట్లు జైపూర్‌లో జరిగిన లిటరేచర్ ఫెస్టివల్‌లో బీఓబీ ఎండీ సీఈఓ సంజీవ్ చద్దా తెలిపారు. ఈ అవార్డులతో దేశం వైవిధ్యం, ఔన్నత్యం, వారసత్వం మరింత పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నంగా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఎంపిక చేసిన సాహిత్య రచనల మూల రచయిత, ప్రాంతీయ భాష నుంచి హిందీలోకి అనువదించిన అనువాదకులకు కూడా ఈ అవార్డు అందిస్తామని తెలిపారు. ప్రతి ఏటా అందించే ఈ అవార్డుకు మూల రచయితకు రూ.21 లక్షలు, అనువాదకుడికి రూ.15 లక్షలు నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డికి వినతి



చార్మినార్: పాతబస్తీలో పాదయాత్ర నిర్వహించి ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరముందని.. అదే విధంగా పాతబస్తీలో మెట్రో రైలు పనుల ప్రారంభం కోసం ఆందోళన చేయాల్సిన అవసరముందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ హైదర్ జాఫ్రీ, హాజీ మహ్మద్ మూసా ఖాసింలు తెలిపారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు. తమ వినతిపత్రంపై రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

హైదరాబాద్ జిల్లా టీబీ కంట్రోల్ అధికారిపై చర్యలు తీసుకోండి



అబిడ్స్: హైదరాబాద్ జిల్లా టీబీ కంట్రోల్ అధికారి కల్పనా కాటేపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనితో పాటు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ కల్పనా కాటే తోటి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంటు, జీపీఎఫ్ క్లేమ్స్, ఇతర లీవ్స్ కూడా మంజూరు చేయకుండా ఉద్యోగులను వేధిస్తుందన్నారు. వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, నరేష్‌కుమార్, మురళీరాజ్, కలీద్ అహ్మద్, శ్రీధర్, జగన్‌కుమార్, శివకుమార్, షకీల్ అహ్మద్, ఈఎస్‌టీ రాజు, సిరాజ్ పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం పెట్టాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ ప్రజా సంఘం నాయకులు

గన్‌ఫౌండ్రీ: గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండా ఎగరవేసే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటాన్ని కచ్చితంగా పెట్టాలని అంబేడ్కర్ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటం లేకుండానే అనేకచోట్ల కార్యక్రమాలను నిర్వహిస్తూ అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ విఠల్, ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కళలకు సముచిత ప్రాధాన్యం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వం కళలు, కళాకారులకు సముచిత ప్రాధాన్యతను ఇస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహించనున్న సుస్వర రాగోత్సవం కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక మరుగున పడిన కళలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్రదర్స్‌గా పేరొందిన రాఘవాచారి, శేషాచారి, ప్రముఖ సంగీత దర్శకులు కే రామాచారి, జయప్రద రామమూర్తిల సంగీత కచేరి ఆహుతులను అలరించాయి. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణచారి, ఐపీఎస్ అధికారి సుమతి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికా రెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

విజేతగా తెలంగాణ జట్టు

సాక్షి, హైదరాబాద్: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ ఇంటర్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ప్రారంభమైంది. ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ఈ మీట్‌లో తొలిరోజు పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ విభాగంలో తెలంగాణ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో తెలంగాణ జట్టు 3–0తో ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలిచింది. మహిళల టీటీ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ 1–3తో కర్ణాటక చేతిలో ఓడిపోయింది. పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్లు సెమీఫైనల్లో ఓడిపోయాయి. సెమీఫైనల్స్‌లో తమిళనాడు 2–0తో తెలంగాణపై, కేరళ 2–1తో ఆంధ్రప్రదేశ్‌పై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించాయి. మహిళల బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో తెలంగాణ జట్టు రన్నరప్ ట్రోఫీతో సంతృప్తి పడింది. ఫైనల్లో తెలంగాణ 0–2తో కర్ణాటక చేతిలో ఓటమి చవిచూసింది. తొలి మ్యాచ్‌లో రాణి నవనీత నాయక్ 21–5, 21–3తో ఎస్.అనూష (తెలంగాణ)పై, రెండో మ్యాచ్‌లో రాణి నవనీత నాయక్–షణ్ముఖ ప్రియ జోడీ 21–12, 21–11తో లక్ష్మీ–అనూష ద్వయంపై గెలిచింది. అంతకుముందు ఎఫ్‌సీఐ తెలంగాణ రీజినల్ స్పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ అధ్యక్షుడు, జనరల్ మేనేజర్ (రీజియన్) దీపక్ శర్మ, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు.



పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహ్మద్ ఆమేర్

నాంపల్లి: సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ఫిబ్రవరి 1 నుంచి 16వ తేదీ వరకు జాతీయ స్థాయి డే అండ్ నైట్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ మహ్మద్ ఆమేర్ వెల్లడించారు. ఆలిండియా కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సైఫాబాదులోని తారా మండల్ కాంప్లెక్స్‌లో డే అండ్ నైట్ క్రికెట్ ట్రోఫీ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. పోటీల్లో పాల్గొనదలచిన యువకులు ముందుగా ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలు నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని, అలాగే 16న జరిగే ఫైనల్ పోటీలు ఎల్బీస్టేడియంలో ఉంటాయని వివరించారు. సైఫాబాదులోని తారామండల్ కాంప్లెక్స్‌లోని కేసీఆర్ సేవాదళం కార్యాలయంలో లేదా 9632984560, 9063967463 ఫోన్ నంబర్లలో పోటీల్లో పాల్గొనదలిచే క్రీడాకారులు సంప్రదించవచ్చని సూచించారు. మహిపాల్‌రెడ్డి, జావీద్ పటేల్, ఇమ్మాన్యుయేల్, అమీనా అంజుమ్, రాణి, కల్యాణ్, మహ్మద్ నజీబుద్దీన్, ఖలీమ్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ అభివృద్ధి



జాంబాగ్‌లో పర్యటించిన టీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో గోషామహల్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ కులశేఖర్‌తో కలిసి జాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీ ఇతర అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నందుకుమార్, కిట్టు, లక్ష్మణ్, భజన్‌సింగ్, మహేష్ గౌడ్, భాస్కర్, శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

28, 29వ తేదీలలో గోల్కొండ కోటకు సెలవు

గోల్కొండ: ఈనెల 28, 29వ (శని, ఆదివారం) తేదీలలో సెలవు ఉంటుందని కేంద్ర పురావస్తు శాఖ మాన్యుమెంట్–2 డైరెక్టర్ డాక్టర్ ఎన్‌కే పాఠక్ తెలిపారు. జీ–20 ప్రతినిధుల బృందం ఈ రెండు రోజులలో గోల్కొండ కోటను సందర్శించనున్నారని, అందుకే సాధారణ పర్యాటకులు అనుమతి లేదని ఆయన పేర్కొన్నారు.

క్యాట్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు



గోల్కొండ: ఏ స్థాయిలో పరీక్ష జరిగినా తమ విద్యార్థులు ప్రతిభ చాటుతారని మెహిదీపట్నం శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి, ఏజీఎం కృష్ణ అన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో 79 మంది శ్రీచైతన్య విద్యార్థులు లెవన్–2 ఫలితాల్లో సత్తాచాటారు. వీరిలో 11 మంది నగదు పురస్కారాలు, 43 మంది పతకాలు, 25 మంది మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు, కో ఆర్డినేటర్ రవికుమార్, డీన్ ఓంకార్, నదీమ్, ఐకాన్ ఇన్‌చార్జి శివ తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

చార్మినార్: సిటీ కళాశాల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులందరూ పునరంకితం కావాలని పర్యాటక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. కళాశాల అల్యూమినీ కమిటీ, ఐక్యూఏసీ సంయుక్తంగా నూతన విద్యా విధానం–2020–ఉన్నత విద్యా సంస్థలలో స్థిరమైన శ్రేష్ఠత సాధనలో పూర్వ విద్యార్థుల పాత్ర–అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా శ్రీనివాసగుప్తా పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నేను కేబినెట్ హోదా కలిగిన పదవిలో ఉన్నప్పటికీ.. సిటీ కళాశాల పూర్వ విద్యార్థినని చెప్పుకోవడానికి గర్విస్తానన్నారు. వంద సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన సిటీ కళాశాల భారతదేశంలోనే సమున్నత విద్యా సంస్థ అని కొనియాడారు. ప్రైవేటు కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థుల కంటే ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు బహుముఖిన రంగాల్లో ప్రతిభావంతులుగా రాణిస్తారన్నారు. విద్యార్థులు జ్ఞానార్జనతో పాటు క్రీడా సంస్కృతిక రంగాల వైపు కూడా దృష్టి సారించి తద్వారా జీవితంలో ఉన్నతిని సాధించాలన్నారు. సిటీ కళాశాలకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా.. తాను ముందు నిలిచి కళాశాల ప్రగతికి దోహదపడుతానని హామీ ఇచ్చారు. నూతన విద్యా విధానం–పూర్వ విద్యార్థుల పాత్రపై ప్రత్యేకంగా జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో పూర్వ విద్యార్థులైన సీనియర్ ఆచార్యులు వెంకటరాజాం, హైకోర్టు పూర్వ రిజిస్ట్రార్ విద్యాధర్ భట్ ఆత్మీ అతిథులుగా పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో గోల్కొండ, టోలిచౌకి డివిజన్లకు చెందిన మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తి కాగానే వెంటనే రోడ్ల పనులు కూడా చేపడుతామని ఆయన అన్నారు. కమ్యూనిటీ హాళ్లలో ప్రభుత్వ ఆస్పత్రులలో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయా ప్రాంతాల నాయకులు, కార్పొరేటర్లు ప్రతినిధులు ప్రతినిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. అదే విధంగా నేత్ర పరీక్షలు జరుగుతున్న విషయాన్ని బస్తీలు, కాలనీల వారికి తెలిసేలా అవసరం అయిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నిరుపేదలు అయిన వారికి నేత్రవైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఆయన అన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఏజే పఠాన్, ఖాద్రి, హబీబ్ చావూస్, జావెద్ తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నిబంధనలు పాటించాలంటూ సూచనలు చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

విజయనగర్‌కాలనీ: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. శుక్రవారం విజయనగర్ కామర్స్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ సేఫ్టీ అండ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు సంబంధించిన ప్రమాదాల్లో 75శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే ఇద్దరూ హెల్మెట్ ధరించాలని, అమలులో ఉన్న లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే మనకు మాత్రమే కాక ఇతరులకు కూడా హాని జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణమూర్తి మాట్లాడుతూ.. ఇప్పటి నుంచి డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఉన్న విద్యార్థులకు మాత్రమే కళాశాల పార్కింగ్ ఏరియాలో వాహనాలను నిలిపేందుకు అనుమతిని ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీఐ అధికారులు భార్గవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వప్న, గోపాల్, రజిని, నాగమణి, వెంకటేశ్వర్‌రావు, శివకోటి పాల్గొన్నారు.

'మా కుటుంబాన్ని రక్షించండి'

- భూ కబ్జాదారుల వేధింపులు భరించలేకపోతున్నాం..
- హెచ్చార్సీలో ఓ బాధిత కుటుంబం ఫిర్యాదు



హెచ్చార్సీ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు నిరసన తెలియజేస్తున్న దృశ్యం

నాంపల్లి: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ భూమిని స్థానిక అధికార పార్టీ నాయకులతో కలిసి కొంత మంది ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, వీరి వేధింపులు తట్టుకోలేక అనేక అవస్థలు పడుతున్నామంటూ ఓ నిరుపేద వ్యవసాయ కుటుంబం శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారి వేధింపులు భరించలేక న్యాయం కోసం స్థానిక పోలీసులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగిన పట్టించుకోలేదని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. చివరకు చేసేదేమిక లేక న్యాయం కోసం హైదరాబాద్‌కు చేరుకుని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. తమ సొంత భూమిని కాపాడుకునేందుకు కబ్జాదారుల వేధింపుల చెర నుంచి తమ కుటుంబాన్ని రక్షించాలని, లేదా సహ కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని బాధిత కుటుంబం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను వేడుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శిఖర్‌గాన్‌పల్లికి చెందిన వెంకటమ్మ తన భర్త నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో వ్యవసాయం చేస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తన భర్త మరణించిన తర్వాత ఆ భూమిని అదే గ్రామానికి చెందిన తమ బంధువులైన నర్సింహస్వామి ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఐదేళ్లుగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరులు కబ్జాదారులకు పోలీసులు కొమ్ము కాస్తున్నారని వెంకటమ్మ కుమారుడు స్వామి ఆరోపించారు. బాధిత కుటుంబం చేస్తున్న పోరాటానికి బీసీ పొలిటికల్ జేఏసీ, వాల్మీకి బోయ సంఘాల నేతలు మద్దతు పలికారు.


ఆకట్టుకున్న స్ప్రింగ్ ఫీల్డ్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోలో అధ్యాపక బృందం

గోల్కొండ: విద్యార్థులు అద్భుతాలు సృష్టించారు. 800 ఏళ్ల ఇస్లామిక్ తృణయుగపు క్రియేషన్స్‌ను చక్కగా తయారు చేసి ప్రదర్శించారు. టోలిచౌకి స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ముస్లిం లెగసీ ఆఫ్ లీడింగ్ ఇన్వెన్షన్ అండ్ ఇన్నోవేషన్ పేరిట శుక్రవారం టోలిచౌకి మెజెస్టిక్ గార్డెన్‌లో ఎక్స్‌పోను నిర్వహించారు. కాగా ఈ ఎక్స్‌పోలో విద్యార్థులు అందరి అంచనాలను తలకిందులు చేస్తూ అద్భుతమైన ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. స్ప్రింగ్ యమాజన్యంతో పాటు ఎక్స్‌పోను తిలకించడానికి వచ్చిన వారు సైతం ఎంతో ఆశ్చర్యంగా వీటిని తిలకించారు. ముస్లిం శాస్త్రవేత్తలు, ఇస్లామిక్ ఆచార వ్యవహారాలతో పాటు ఆచార వ్యవహారాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఎంతో చక్కగా ప్రదర్శించారు. అంతేకాకుండా రూఫ్ ఫార్మింగ్, టాయిలెట్స్, గ్రీనరీ ఆవశ్యకతతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను సైతం చిత్రాల రూపంలో అద్భుతంగా విద్యార్థులు ప్రదర్శించారు. ఎనిమల్ హస్బెండరీ, వ్యవసాయం, పవన విద్యుత్, సౌండ్ సిస్టమ్, పబ్లిక్ హియరింగ్, ఫీ నావిగేషన్ తదితర విషయాలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు.

ఎంతో ఆనందంగా ఉంది..



పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహకం, అధ్యాపక బృందం సలహాలు, సూచనలతో ప్రాజెక్టు తయారు చేశాం. ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ తమలోని ప్రతిభను విద్యార్థులచే వెలికితీయించడం మా పాఠశాల అధ్యాపక బృందం ప్రత్యేకత.

– షోయబ్ మాలిక్, 9వ తరగతి

అవకాశాలను అందిపుచ్చుకుంటున్నా..

పాఠశాలల వారు ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాం. ప్రతిఏటా ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాం. రూఫ్ ఫార్మింగ్‌పై నాకెంతగానో అభిరుచి ఉంది. ముున్ముందు వ్యవసాయ శాస్త్రవేత్తగా తయారవ్వాలనేదే నా లక్ష్యం.

–ఎ. అంజద్, 8వ తరగతి